హైదరాబాద్‌లో పీబీపార్టనర్స్ ఆఫీస్

హైదరాబాద్, ఆగస్టు 30: పాలసీ బజార్ ఇన్సూరెన్స్ బ్రోకర్‌కు చెందిన పీబీపార్టనర్స్..తెలంగాణ మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం వచ్చే రెండు నెలల్లో హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించడంతోపాటు కస్టమర్ కేర్ సెంటర్‌ను నెలకొల్పనున్నట్లు పీబీపార్టనర్స్ అసోసియేట్ డైరెక్టర్, సేల్స్ హెడ్ అమిత్ భదోరియా తెలిపారు. వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే రెండేండ్లలో వరంగల్, కరీంనగర్‌తోపాటు వైజాగ్, తిరుపతి, కోయంబత్తూరులలో కార్యాలయాలను తెరువాలనుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో 5,500కి పైగా ఏజెంట్లు ఉన్నారని, వచ్చే రెండేండ్లలో ఈ సంఖ్యను రెండింతలు పెంచుకోనున్నట్లు ప్రకటించారు. దేశవ్యాప్తంగా కోటికి పైగా వాహన పాలసీలు విక్రయించినట్లు, దీంట్లో తెలంగాణలో 3 లక్షలు, ఏపీలో 3.5 లక్షలు ఉన్నాయన్నారు.

విస్తారా కనుమరుగు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: చౌక విమానయాన సంస్థ విస్తారా ఎయిర్‌లైన్స్ ఇక కనుమరుగుకాబోతున్నది. విస్తారా బ్రాండ్‌తో నవంబర్ 11న తన చివరి విమాన సర్వీసును నడుపబోతున్నది. టాటా గ్రూపునకు చెందిన ఎయిర్ ఇండియాలో నవంబర్ 12 నుంచి విలీనం కానుండటంతో తన బ్రాండ్ సేవలు నిలిచిపోనున్నాయని తాజాగా వెల్లడించింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇక ఎయిర్ ఇండియా-విస్తారా విలీనం కాబోతున్నాయి. టాటా గ్రూపు, సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా గతంలో విస్తారా ఎయిర్‌లైన్స్‌ను ఏర్పాటు చేశాయి. ఆ తర్వాతి క్రమంలో ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను టాటా గ్రూపు కొనుగోలు చేయడంతో తన అనుబంధ విమానయాన సంస్థలను ఒక్కతాటిపైకి తేవడానికి ప్రయత్నిస్తున్నది. విలీనం తర్వాత ఎయిర్ ఇండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా కలిగివుండనున్నది. ఇప్పటికే ఇరు సంస్థలు విమానాలకు సంబంధించి లావాదేవీలు కలిసి నిర్వహిస్తున్నాయని, ముఖ్యంగా ఉద్యోగులు కలిసి పని చేస్తున్నారని ఎయిర్ ఇండియా సీఈవో, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ తెలిపారు.

జీడీపీ డౌన్.. ఇన్‌ఫ్రా స్లో

తొలి త్రైమాసికంలో 15 నెలల కనిష్టానికి వృద్ధిరేటు

- ఈ ఏప్రిల్-జూన్‌లో 6.7 శాతానికే పరిమితం
- జూలైలో 6.1 శాతానికి మందగించిన కీలక రంగాల పనితీరు
- తాజాగా విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లో తేటతెల్లం

న్యూఢిల్లీ, ఆగస్టు 30: దేశ ఆర్థిక వ్యవస్థను నిస్తేజం ఆవరించింది. ఓవైపు వృద్ధిరేటు.. మరోవైపు కీలక రంగాల పనితీరు మందగించాయి. శుక్రవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లో ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో దేశ జీడీపీ 15 నెలల కనిష్టానికి దిగజారినట్టు తేలింది. అలాగే జూలై నెలకుగాను 8 కీలక రంగాల్లో వృద్ధిరేటు 6.1 శాతానికే పరిమితమైనట్టు స్పష్టమైంది.

వ్యవసాయ, సేవా రంగాలు డీలా

వ్యవసాయ, సేవల రంగాల ప్రదర్శన పేలవంగా ఉండటమే ఈ ఏప్రిల్-జూన్‌లో దేశ జీడీపీ వృద్ధిరేటు 5 త్రైమాసికాల కనిష్టాన్ని తాకుతూ 6.7 శాతానికే పరిమితం కావాల్సి వచ్చిందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) పేర్కొన్నది. 2023 జనవరి-మార్చిలో దేశ జీడీపీ వృద్ధిరేటు 6.2 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ స్థాయి దరిదాపుల్లోకి ఇప్పుడే గణాంకాలు వెళ్లాయి. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఏప్రిల్-జూన్‌లో 8.2 శాతంగా ఉండటం గమనార్హం. ఈ ఏడాది జనవరి-మార్చిలోనూ 7.8 శాతం వృద్ధి కనిపించింది. దీంతో 3 నెలల్లో జీడీపీ 1 శాతానికిపైగా పడిపోయినట్టైంది.

ఆయా రంగాలవారీగా..

ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వ్యవసాయ రంగ జీవీఏ (గ్రాస్ వాల్యూ ఆడెడ్) 3.7 శాతం నుంచి 2 శాతానికి క్షీణించినట్టు ఎన్ఎస్‌వో తెలియజేసింది. అలాగే ఆర్థిక, నిర్మాణ, ప్రొఫెషనల్ సర్వీసెస్ జీవీఏ కూడా నిరుడు ఏప్రిల్-జూన్‌తో పోల్చితే 12.6 శాతం నుంచి 7.1 శాతానికి దిగజారింది. ట్రేడ్, హోటల్స్, రవాణా, కమ్యూనికేషన్ అండ్ సర్వీసెస్ విభాగాల్లోనూ వృద్ధి 9.7 శాతం నుంచి 5.7 శాతానికి పతనమైంది. ఈ క్రమంలోనే ప్రధానమైన తయారీ రంగ జీవీఏ 2 శాతం పెరిగి 7 శాతానికి పుంజుకున్నా.. మైనింగ్-క్వారీయింగ్, విద్యుత్తు, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సర్వీసుల్లో ఆకర్షణీయ వృద్ధి ఉన్నా ఫలితం లేకపోయింది. ఇదిలావుంటే ప్రస్తుత ధరల వద్ద ఈసారి జీడీపీ విలువ రూ.77.31 లక్షల కోట్లుగా ఉన్నట్టు ఓ ప్రకటనలో ఎన్ఎస్‌వో తెలిపింది.

మౌలికం బేజారు

దేశ పారిశ్రామిక ప్రగతికి ప్రామాణికంగా భావించే 8 కీలక రంగాల్లో మందగమనం అలుముకున్నది. గత నెల జూలైలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు రంగాల్లోని ఉత్పాదకతలో వృద్ధిరేటు 6.1 శాతంగానే ఉన్నది. నిరుడు జూలైలో ఇది 8.5 శాతంగా ఉండటం గమనార్హం. భారతీయ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఈ 8 రంగాల వాటా 40.27 శాతంగా ఉండటం విశేషం. అలాంటిదిప్పుడు ఆయా రంగాల్లో ఉత్పత్తి ఏడాది కాలంలో 2.4 శాతం మేరకు పడిపోయింది. ముడి చమురు ఉత్పత్తి మైనస్ 2.9 శాతంగా, సహజ వాయువు ఉత్పత్తి మైనస్ 1.3 శాతంగా ఉండటం దెబ్బతీసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే బొగ్గు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు రంగాల్లోనూ ఉత్పాదకత గతంతో పోల్చితే వరుసగా 6.8 శాతం, 7.2 శాతం, 5.5 శాతం, 7 శాతాలకు పడిపోయింది. దీంతో రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువుల రంగాల్లో 6.6 శాతం, 5.3 శాతం చొప్పున వృద్ధి నమోదైనా ప్రయోజనం లేకపోయింది.

గూగుల్ పేలో కొత్త ఫీచర్లు

- యూపీఐ సర్కిల్ పరిచయం
- ఈరూపీ వోచర్ల జారీ, ట్యాప్‌అండ్‌పే పేమెంట్లూ షురూ

న్యూఢిల్లీ, ఆగస్టు 30: ప్రముఖ పేమెంట్స్ యాప్ గూగుల్ పేలో కొత్త ఫీచర్లను తీసుకొచ్చారు. ఇందులో భాగంగానే శుక్రవారం యూపీఐ సర్కిల్‌సహా మరి కొన్నింటిని పరిచయం చేశారు. ముంబైలో 3 రోజులపాటు జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్) 2024 ముగింపు సందర్భంగా ఈ మేరకు గూగుల్ పే నుంచి ప్రకటనలు వచ్చాయి. కాగా, యూపీఐ సర్కిల్‌తో గూగుల్ పే వినియోగదారులు (ప్రైమరీ యూజర్లు) తమ కుటుంబ సభ్యులు, స్నేహితులను సెకండరీ యూజర్లుగా అనుమతించవచ్చు. దీంతో తమ బ్యాంక్ ఖాతాను లింక్ చేసుకోకుండానే ఇకపై వీరంతా కూడా ప్రైమరీ యూజర్ అకౌంట్ ద్వారానే డిజిటల్ చెల్లింపులను జరుపుకోవచ్చు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) భాగస్వామ్యంతో దీన్ని తీసుకొచ్చింది. అలాగే ఈ సందర్భంగా యూపీఐ వోచర్స్ (ఈరూపీ)నూ గూగుల్ పే ప్రారంభించింది. ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలతోపాటు ప్రస్తుత యూపీఐ వినియోగదారులు వీటిని జారీ చేయవచ్చు. అంతేగాక రూపే కార్డుల కోసం ట్యాప్‌అండ్‌పే చెల్లింపుల సౌకర్యాన్నీ కల్పించింది. ఈ పేమెంట్స్ కోసం రూపే కార్డుదారులు తమ మొబైల్ ఫోన్లను కార్డులతో అనుసంధానించుకోవాల్సి ఉం టుంది. యూపీఐ లైట్ కోసం ఆటోపే ఆప్షన్, యాప్‌పై క్లిక్‌పే క్యూఆర్ కోసం సపోర్ట్‌నూ అందిస్తున్నది. కాగా, ఆర్థిక వ్యవస్థలో డిజిటలైజేషన్‌ను మరింత విస్తృతపర్చడానికి ఈ నెలలో జరిగిన ద్రవ్యసమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన అనుమతుల మేరకే ఈ ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి.

బ్రోకర్లపై సెబీ కొరడా

46 స్టాక్, కమోడిటీ బ్రోకరేజీల రిజిస్ట్రేషన్లు రద్దు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. 46 స్టాక్, కమోడిటీ బ్రోకరేజీ సంస్థలపై కొరడా ఝుళిపించింది. నిబంధనల మేరకు లేని 39 స్టాక్ బ్రోకర్లు, 7 కమోడిటీ బ్రోకర్ల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను శుక్రవారం రద్దు చేసింది. అలాగే 22 డిపాజిటరీ పార్టిసిపెంట్స్ రిజిస్ట్రేషన్లనూ క్యాన్సిల్ చేస్తూ నిర్ణయం తీసుకున్నది. రిజిస్ట్రేషన్లు రద్దైనా.. స్టాక్ లేదా కమోడిటీ బ్రోకర్లుగా, డిపాజిటరీ పార్టిసిపెంట్లుగా గతంలో తీసుకున్న చర్యలకు, వైఫల్యాలకు ఇకపైనా వారు బాధ్యులేనని వేర్వేరుగా ఇచ్చిన తాజా ఆదేశాల్లో సెబీ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే సెబీకి బాకీపడిన వడ్డీలు, ఫీజులు, ఇతరత్రా బకాయిలను చెల్లించాల్సిందేనన్నది.

ఆర్థికాభివృద్ధిలో విదేశీ వాణిజ్యం కీలకం

ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ డీజీ శశాంక్ గోయల్

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో విదేశీ వాణిజ్యం, పెట్టుబడులు కీలకపాత్ర పోషిస్తాయని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ) కేంద్రం డైరెక్టర్ జనరల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ చెప్పారు. విదేశీ వాణిజ్యం కేవలం జీడీపీని మాత్రమే కాదు.. ఉద్యోగావకాశాలు, వేతనాలను కూడా పెంచుతుందని పేర్కొన్నారు. భారత విదేశాంగ మంత్రిత్వశాఖ ఐటెక్ విభాగం సహకారంతో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తల శిక్షణా కోర్సు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోయల్ మాట్లాడుతూ.. ఈజిప్ట్, భారత్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు చారిత్రాత్మకంగా ఉన్నాయని గుర్తుచేశారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తలకు, వారి దేశాభివృద్ధికి దోహదపడేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను అందిస్తాయని చెప్పారు. అనంతరం ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తలకు కోర్సు పూర్తి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ డాక్టర్ మాధవి రవులపాటి, ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

10 లక్షల కోట్లు పెరిగిన సంపద

స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీతో మదుపర్లలో ఖుషి

ముంబై, ఆగస్టు 30: దేశీయ స్టాక్ మార్కెట్ల రికార్డుల పరంపర కొనసాగుతున్నది. రోజుకొక చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్న సూచీలు శుక్రవారం మరో మైలురాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల జోరు కొనసాగుతుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడం, వచ్చే నెలలో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఫలితంగా ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 231.16 పాయింట్లు లాభపడి చారిత్రక గరిష్ఠ స్థాయి 82,365.77 వద్ద ముగిసింది. వారాంతం ట్రేడింగ్‌లో 2,228 సూచీలు లాభపడగా, 1,701 సూచీలు నష్టపోయాయి. మరో సూచీ నిఫ్టీ సైతం ఉన్నత శిఖరానికి చేరుకున్నది. వరుసగా 12 రోజులుగా పెరుగుతూ వచ్చిన నిఫ్టీ శుక్రవారం సైతం 83.95 పాయింట్లు ఎగబాకి 25,235.90 పాయింట్ల వద్ద ముగిసింది. దీంతో స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీతో మదుపరుల సంపద రూ.10 లక్షల కోట్లు పెరిగింది. గత తొమ్మిది సెషన్లలో సెన్సెక్స్ 1,941 పాయింట్లు లాభపడటంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.10,00,028 కోట్లు పెరిగి రూ.4,64,39,993.77 కోట్లు (5.54 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. వచ్చే నెలలోనే ఫెడ్ వడ్డీరేట్లను తగ్గించనుండటంతో గ్లోబల్ మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిశాయి..దీంతో దేశీయ సూచీలు కూడా పరుగులు పెట్టాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.



- మొత్తంమీద ఈ వారంలో సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు(1.57 శాతం), నిఫ్టీ 412.75 పాయింట్లు(1.66 శాతం) లాభపడ్డాయి. గత తొమ్మిది రోజుల్లో సెన్సెక్స్ 1,941(2.41 శాతం), నిఫ్టీ 1,097 పాయింట్లు(4.54 శాతం) చొప్పున పెరిగాయి.
- వారాంతం ట్రేడింగ్‌లో బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా, ఎన్‌టీపీసీ, ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా షేర్లు ఒక్క శాతానికి పైగా లాభపడ్డాయి. దీంతోపాటు టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, కొటక్ బ్యాంక్, ఎస్బీఐ, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, నెస్లేలు లాభాల్లో ముగిశాయి.
- కానీ, టాటా మోటర్స్, రిలయన్స్, టెక్ మహీంద్రా, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతిలు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే రియల్టీ 1.88 శాతం బలపడగా, హెల్త్‌కేర్ 1.41 శాతం, యుటిలిటీస్, కమోడిటీస్, టెక్, సేవల రంగ షేర్లు కదంతొక్కాయి.

నేడు రామగుండానికి డిప్యూటీ సీఎం

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

- ఆయన వెంటే ఇద్దరు మంత్రుల రాక

పెద్దపల్లి, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ)/గోదావరిఖని/ఫర్టిలైజర్ సిటీ/ జ్యోతినగర్ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మం త్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు హర్కార్ వేణుగోపాల్ శనివారం రామగుండంలో పర్యటించనున్నారు. ఈ మేరకు వివరాలను కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ వెల్లడించారు. ఉదయం 10.30 గంటలకు 800ల మెగావాట్ల తెలంగాణ జెన్‌కో ప్లాంటు, 11.05కు మేడిపల్లి మినీ ఓసీపీ, ఆర్జీ-1ను సందర్శించనున్నారు. మధ్యాహ్నం 12.05 గంటలకు గోదావరిఖని సెక్టార్-2 నైపుణ్య కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజలతో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 1.30కి ఎన్టీపీసీలోని ఇల్లందు గెస్ట్‌హౌజ్‌లో భోజనం చేసి 2.30గంటలకు మంచిర్యాల జిల్లా చెన్నూరుకు బయలుదేరి వెళ్లనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇక్కడ కనీస వేతనాల సలహామండలి చైర్మన్ జనక్ ప్రసాద్, సింగరేణి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఎస్ఈ విజేందర్, డీఈలు, మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

డిప్యూటీ సీఎం పర్యటనకు బందోబస్తు

డిప్యూటీ సీఎం పర్యటనకు సంబంధించి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ తెలిపారు. డిప్యూటీ సీఎం పర్యటించనున్న ప్రదేశాలను శుక్రవారం పరిశీలించారు. కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ గ్రౌండ్, రామగుండం, గోదావరిఖనిలో పలు శంకుస్థాపన చేసే స్థలాలు, సభా వేదిక వద్ద భద్రతాపరమైన ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాల పార్కింగ్, సభకు వచ్చే మార్గాలపై అధికారులతో చర్చించి పర్యటన ప్రాంతాల్లో పూర్తిస్థాయి నిఘా, పటిష్టమైన బదోబస్తు ఏర్పాట్లకు అవసరమైన చర్యలపై పోలీసు అధికారులకు సూచనలు జారీ చేశారు. ఇక్కడ పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘువేంద్ర, గోదావరిఖని ఏసీపీ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సురేంద్ర ఉన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి

రామగుండం పర్యటనకు వస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రి శ్రీధర్‌బాబులు సింగరేణి మేడిపల్లి ఓసీపీ 4 ప్రభావిత మేడిపల్లి గ్రామ ఎస్సీ కాలనీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజిని అమలు చేయాలని బాధితుల తరుపు మూడో డివిజన్ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ డిప్యూటీ సీఎంను విజ్ఞప్తి చేశారు. మేడిపల్లి ఓసీపీలో సింగ రేణి యాజమాన్యం చేపట్టనున్న 500 మెగావాట్ల హైడ్రా థర్మల్ ప్రాజెక్టు నిర్మాణ పరిశీలనకు వస్తున్న డిప్యూటీ సీఎం ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభావిత గ్రామంలోని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సింగరేణిలో బదిలీ వర్కర్లకు తీపి కబురు

గోదావరిఖని, ఆగస్టు 30: సింగరేణిలో పనిచేస్తున్న 2,364మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా త్వరలో క్రమబద్ధీకరిస్తున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ నాయకు తీపి కబురు జారి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంపెనీలో పనిచేసినప్పటి నుంచి క్యాలెండర్ ఏడాదిలో భూగర్భ గనిలో 190 రోజులు, ఉపరిత గనులు, ఇతర విభాగాల్లో 240 రోజులు విధులు నిర్వహించిన వారిని రెగ్యూలరైజ్ చేస్తున్నట్లు వెల్లండించారు. త్వరలోనే ఉత్తర్వూలు జారి చేయాలని సంస్థ డైరెక్టర్ పర్సనల్‌కు ఆదేశాలు జారి చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 1నుంచి వీరిని జనరల్ మజ్దూర్‌గా గుర్తించబోతున్నట్లు స్పష్టం చేశారు. కారుణ్య, డిపెండెంట్ ఉద్యోగ నియామక పక్రియలో భాగంగా సంస్థలో చేరిన వారిని బదిలీ వర్కర్లుగా సంస్థ నియమిస్తోందన్నారు. జనరల్ మజ్దూర్లుగా సంస్థలో 243మంది మహిళలు అర్హులుగా ఉన్నట్లు గుర్తించామన్నారు.

ఆరెంద పంచాయతీలో అక్రమాలు

- కార్యదర్శిపై ఫిర్యాదుల వెల్లువ
- విచారణ చేపట్టిన డీఎల్‌పీవో
- రూ.11లక్షల అవినీతి బట్టబయలు!
- ఉన్నతాధికారులకు నివేదిక
- రేపో మాపో చర్యలకు ఉపక్రమణ

ఆరెంద గ్రామ పంచాయతీ

పెద్దపల్లి, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): మంథని మండలం ఆరెంద పంచాయతీ అక్రమాలకు నిలయంగా మారింది. కార్యదర్శి అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. 2024 మార్చిలో అప్పటి పంచాయతీ కార్యదర్శి ఎన్. సాగర్‌రావు అక్రమాలకు పాల్పడ్డాడని ముత్తారం మండలం ఖమ్మంపల్లి మాజీ సర్పంచ్ సముద్రాల రమేశ్ జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాడు. దీంతో గత జూలైలో విచారణకు ఆదేశిస్తూ డీపీవో ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టు 1న ఆరెంద పంచాయతీలో మంథని డీఎల్‌పీవో సతీశ్ విచారణ చేపట్టారు. ప్రస్తుతం జూలపల్లి మండలం వెంకట్రావ్‌పల్లి జేపీఎస్‌గా పనిచేస్తున్న అప్పటి ఆరెంద కార్యదర్శి సాగర్‌రావుతోపాటుగా ఎంపీవో టీ. శేషయ్యసూరి, ఆరెంద ఓపీఎల్ ఆర్ చంద్రశేఖర్‌ను విచారించారు. విచారణలో సాగర్ రావు కార్యదర్శిగా పనిచేసిన కాలం అక్టోబర్ 2019 నుంచి జూన్ 2024 వరకు 8-14 సంవత్సరం నుంచి జూన్ 2024 వరకు పంచాయతీ రికార్డులను పరిశీలించారు. 2019-20 నుంచి 2024-25 జూన్ వరకు ఐఎఫ్ఎంఐఎస్, పీఎఫ్ఎంఎస్ పోర్టల్స్ ఆరెంద లాగిన్ లో జారీ చేసిన లావాదేవీలను పరిశీలించగా కొన్ని చెక్కులకు సంబంధిత బిల్స్ లేవని గుర్తించారు. మరికొన్ని లావా దేవీలు స్టాక్ ఎంట్రీ బుక్‌లో నమోదు చేయలేదు. పంచాయతీ సమావేశాలు నిర్వహించిన రిజిస్టర్లను(ఎజెండా, హాజరు) విచారణ సందర్భంగా సమర్పించలేదు. 2019-20 నుంచి జూన్ 2024-25 వరకు పంచాయతీ చెల్లింపుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించగా కొన్నింటికి సంబంధిత బిల్స్ లేకుండానే చెల్లింపులు జరిపినట్లు గుర్తించారు. పంచాయతీ ట్రాక్టర్ లాగ్ బుక్కు నిర్వాహణ రిజిస్టర్, 2019-20 నుంచి జూన్ 2024-25 ఇంటి పన్నుల వసూళ్లు జమ వివరాలకు సబంధించిన రికార్డులను చూపించలేదు. ఇతర రికార్డుల నిర్వాహణలో సైతం కార్యదర్శి నిర్లక్ష్యం చేసినట్లు విచారణ నివేదికను అందించారు. 2019-20 నుంచి జూన్ 2024-25 వరకు ఐఎఫ్ఎంఐఎస్, పీఎఫ్ఎంఎస్ పోర్టల్స్ లావాదేవీల వివరాలను సైతం సమర్పించారు. ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి ఇ. చంద్రశేఖర్ 22జూలై 2024 బదిలీపై వచ్చినప్పటికీ ఇక్కడ పనిచేస్తూ ఓదెల మండలం మడక కార్యదర్శిగా బదిలీపై వెళ్లిన అజ్మీరా జ్యోతి చార్జ్ అందజేయలేదని సైతం తమకు వాం గ్మూలం ఇచ్చినట్లుగా ఎంపీఓ నివేదికలో సమర్పించారు. అలాగే పంచాయతీలో 2019నుంచి జరిగిన 11లక్షల వరకు చెల్లింపులు సరిగా రికార్డుల్లో లేవని, ఉన్న చెల్లింపులకు బిల్లులు లేకుండానే చేశారనే విషయాన్ని సైతం నివేదికల్లో పొందుపరిచారు. చెల్లింపుల రికార్డు ప్రకారం ఎక్కడా కూడా సర్పంచ్ కానీ, కార్యదర్శి కానీ నిబంధనలను ఉల్లంఘించి చెల్లింపులు జరిపినట్లు ధ్రువీకరించారు. ఎంబీలు, బిల్స్ లేకుండా, పంచాయతీ తీర్మానాలు కూడా లేకుండా చెల్లింపులు జరిపారని గుర్తించి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపించారు. కాగా, ఉన్నతాధికారులో నేడో రేపో కార్యదర్శిపై చర్యలు తీసుకునేందుకు సమాయత్తమవుతున్నారు.

అండాలమ్మగుడిపై గుప్త నిధుల ముఠా కన్ను

పెద్దపల్లి రూరల్, ఆగస్టు30: ముత్తారం గ్రామపంచాయతీకి అనుబంధ గ్రామమైన ధర్మాబాద్‌లో వెలిసిన రంగనాయకుల స్వా మి దేవాలయానికి అనుబంధ ఆలయంగా నిర్మితమై ఉన్న అండాలమ్మ దేవాలయంపై గుప్త నిధుల ముఠా కన్నుపడినట్లు తెలుస్తోంది. ఇందుకోసమే గుర్తు తెలియని దుం డగులు ధర్మాబాద్‌లోని అండాలమ్మ దేవాలయానికి కన్నం చేసి గోపురాన్ని ధ్వంసం చేసినట్లుగా గ్రామస్తులతోపాటు పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతమై చర్చ కొనసాగుతోంది. జరిగిన సంఘటన విషయంపై గ్రామస్తుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు పెద్దపల్లి పోలీసులు దర్యా ప్తు ముమ్మరం చేసి విచారణ చేపడుతున్నారు. ఏది ఏమైనా చాలా రోజుల తర్వాత పెద్దపల్లి మండలం ముత్తారానికి అనుబంధ గ్రామంగా ఉన్న అండాలమ్మ దేవాయం గుప్త నిధుల వేట కోసమే దుండగులు ఇలాంటి ప్రయత్నాలు చేసి ఉంటారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

మెడికల్ బోర్డుఅవినీతి మయం

గోదావరిఖని, ఆగస్టు 30: సింగరేణిలో మెడికల్ బోర్డు అవినీతి మయమైందని, ఐదు నుంచి ఎనిమిది లక్షల రూపాయల ఇచ్చిన వారికి డాక్టర్లు అన్‌ఫిట్ చేస్తున్నారని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. శుక్రవారం కొత్తగూడెంలో జరిగిన యూనియన్ కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులు అన్‌ఫిట్ కోసం వెళితే చేయడం లేదని, లక్షల రూపాయలు దండుకుని డాక్టర్లు మెడికల్ అన్‌ఫిట్‌లు చేస్తున్నారని ఆరోపించారు. మెడికల్ బోర్డులో అవినతీ తగ్గలంటే 1981 ఒప్పందం ప్రకారం మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో రాజకీయ జోక్యానిన ఆరికట్టాలన్నారు. ఇక కొత్త గనులు తీసుకురావాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని, కంపెనీ లాభాల్లో 35శాతం లాభాల వాటాను వెంటనే కార్మికులకు చేల్లించాలన్నారు. యూనియన్ నాయకులు కొరిమి రాజ్‌కుమార్, మిర్యాల రంగయ్య, వైవీ రావు, వీరభద్రం, సారయ్య, సమ్మయ్య, వం వెంకట్, రాంగోపాల్, క్రిస్టోఫర్, తదితరులు ఉన్నారు.

ఒకరికి రెండేళ్ల జైలు

ధర్మారం,ఆగస్టు30: భార్యకు విడాకులు ఇవ్వకుండా మరో మహిళను వివాహం చేసుకున్న భర్తకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ నంది మేడారం జూనియర్ సివిల్ జడ్జి ఎన్.వెంకట్ సచిన్‌రెడ్డి తీర్పు చెప్పారు. ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మారం మండల కేంద్రానికి చెందిన రాగుల మల్లేశం శ్రీలత అనే యువతిని వివాహం చేసుకున్నాడు. ఏడాది తర్వాత మల్లేశం మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని పెట్టుకొని తనను వేధిస్తున్నాడని, అత్తమామలు అతనికి మద్దతు తెలిపారని పేర్కొంటూ 2015 డిసెంబర్ 2న పోలీస్ స్టేషన్‌లో శ్రీలత ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ లక్ష్మీనారాయణ మల్లేశంపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ లక్ష్మణ్,కానిస్టేబుల్ బి.సంతోష్ సాక్షులను కోర్టులో ప్రవేశ నేరం రుజువు చేశారు. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే మల్లేశం మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడనే విషయం రుజువైంది.దీంతో రాగుల మల్లేశంకు రెండేళ్ల జైలు శిక్ష విధించటంతో పాటు రూ.6 వేలు జరిమాన విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

కార్మిక సమస్యలపై ఉప ముఖ్యమంత్రి స్పందించాలి

గోదావరిఖని, ఆగస్టు 30: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సింగరేణి కార్మిక సమస్యలపై స్పందించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నాయకుడు, జేబీసీసీఐ సభ్యుడు మంద నరసింహారావు డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.30వేల కోట్ల బకాయిలు, సంస్థకు వచ్చిన లాభాల్లో 35శాతం లాభాల వాటా కార్మికులకు చెల్లింపు, కార్మికుల సొంత ఇంటి పథకం, 240 గజాల స్థలం కేటాయింపు, వడ్డీలేని రూ. 20లక్షల రుణం, మారుపేర్ల మార్పు, అలవెన్స్‌లపై ఆదాయపు పన్ను సమస్యలను పరిష్కరించాలన్నారు. యూనియన్ బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు ఆరెపల్లి రాజమౌళి, మండే శ్రీనివాస్, ఆర్జీ-1 కార్యదర్శి మెండె శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు తోట నరహరిరావు, బ్రాంచి ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, దాసరి సురేశ్, శంకరన్న, తాళ్ల శ్రీనివాస్, జనార్ధన్, జలగం సత్యనారాయణ, అట్ల సత్యనారాయణ, సంపత్‌కుమార్, గద్దల నరసింహారావు, బండ శ్రీకాంత్‌రెడ్డి, సందీప్, పాలేటి నరేశ్ ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ బకాయిలు ఇప్పించండి

సింగరేణి నుంచి రాష్ట్ర ప్రభుత్వ నుంచి రావాల్సిన రూ. 29వేల కోట్లను ఇప్పించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. భాస్కర్‌రావు భవన్‌లో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం మాట్లాడారు. కొత్త గనులను ప్రారంభించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నారు. ఇక్కడ నాయకులు దొంత సాయన్న, ఎం చక్రపాణి, బండారి శ్రీనివాస్, కారంపూడి వెంకన్న, దాసరి శ్రీనివాస్, నంది నరేశ్, ఎర్రల రాజయ్య, పడాల కనకరాజ్, బూడిద మల్లేష్, గంగారపు చంద్రయ్య, రాజేశ్వర్‌రావు, చెప్యాల మహేందర్‌రావు, సుదర్శన్, రమేష్‌కుమార్ ఉన్నారు.